ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కరీంనగర్
జిల్లా వార్తలు
5
శనివారం 1 మార్చి 2025



గెలుపుపై ఆశలు

ఎవరి ధీమాలో వారే

ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను తలపించేలా జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ మధ్య నువ్వా..నేనా అన్నట్లు సాగిన పోరులో విజయం ఎవరిని వరించనున్నదోనని ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటుండగా తామే గెలుస్తామని ఎవరికివారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. హోరాహోరీగా సాగిన ముక్కోణపు పోటీలో మొదటి, రెండు స్థానాల్లో నిలిచేదెవరూ.. మూడో స్థానంలో ఉండేదెవరు..అన్నదానిపైనే అన్ని రాజకీయ పార్టీలు కూడికలు..తీసివేతలతో తలపడుతున్నాయి. తొలి ప్రాధాన్యత ఓటుతో ఎవరు గెలిచే అవకాశం లేదన్నది స్పష్టంగా తేలిపోయింది. తొలి ప్రాధాన్యత ఓటుతో అభ్యర్థి విజయం సాధించాలంటే పోలైన ఓట్లలో చెల్లిన ఓట్లలో 50శాతానికంటే ఒక ఓటు అధికంగా రావలసి ఉంటుంది. ఏకపక్షంగా పోలింగ్ జరుగకపోవడం, ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కరికి ఓట్లు ఎక్కువగా పోల్‌కావడంతో తొలి ప్రాధాన్యత ఓటుతో ఎవరు గెలిచే అవకాశం లేదని భావిస్తున్నారు.

స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ ఎస్‌యూ అధ్యక్షుడు చిట్యాల రాజు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ శాతవాహన యూనివర్సిటీ అధ్యక్షుడు చిట్యాల రాజు ప్రభుత్వాన్ని కోరారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్‌ఎఫ్‌ఐ శాతవాహన యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. స్కాలర్‌షిప్‌పై ఆధారపడి చదువుకునే వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో రీయింబర్స్‌మెంట్‌తో చదువుకునే విద్యార్థులను కళాశాల యాజమాన్యాలు ముందుగానే ఫీజులు కట్టించుకుంటున్నాయన్నారు. దీంతో పేద విద్యార్థులు వారి చదువులకు దూరం అయ్యే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ పూర్తి స్థాయిలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడం ద్వారా ప్రైవేటు యాజమాన్యాలు కళాశాలను మూసివేసే పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం శాతవాహన యూనివర్సిటీకి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల ద్వారా శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులకు అదనపు భారం పడుతుందన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌ఎఫ్‌ఐ శాత వాహన యూనివర్సిటీ నాయకులు వినోద్, శివ, మధుకర్, శివసాయి పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 'మూడంచెల భద్రత'

ప్రత్యేక సాయుధ బలగాలతో కాపలా

సీసీ కెమెరాలతో నిఘా



కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా కీలకమైన పోలింగ్ పర్వం గురువారం ముగియటంతో ఈవీఎంలు శుక్రవారం ఉదయం వరకు కరీంనగర్‌కు తరలించారు. అంబేద్కర్ స్టేడియంలోని ఇండోర్ స్టేడియంలో బ్యాలట్ బాక్స్‌లను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు శుక్రవారం ఉదయం 5 గంటలకు జిల్లా కలెక్టర్ సీల్ వేశారు. అనంతరం స్ట్రాంగ్‌రూంల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియటంతో పోలీసు ఉన్నతాధికారులు సైతం ఊపిరి పీల్చుకున్నారు. 15 జిల్లాలలోని 42 నియోజకవర్గాలకు చెందిన 773 పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలట్ బాక్స్‌లు కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియం స్ట్రాంగ్‌రూంలలో భద్రపరిచారు. స్ట్రాంగ్‌రూం సీల్ చేయటమే కాకుండా మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు.

మూడు అంచెల భద్రతలో భాగంగా బ్యాలట్ బాక్స్‌లు భద్రపరిచిన గదుల ముందు మొదటి దశగా స్పెషల్ ఫోర్స్‌కు చెందిన సాయుధ బలగాలు, రెండవదశలలో ఇండోర్ స్టేడియం చుట్టూ ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలు, మూడవ దశలో అంబేద్కర్ స్టేడియం ప్రధాన గేట్‌తో పాటు స్టేడియం చుట్టూ సివిల్ పోలీసులను మోహరించారు. స్ట్రాంగ్ రూంలు భద్రపరిచిన అంబేద్కర్ స్టేడియం ప్రాంతంలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి వాటిని కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానం చేశారు. స్టేడియం చుట్టూ 24 గంటల పాటు పోలీసు గస్తీ ఏర్పాటు చేసి పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు. మార్చి 3న కౌంటింగ్ రోజు వరకు బ్యాలట్ బాక్స్‌ల భద్రతకు ఎలాంటి భంగం వాటిల్లకుండా ప్రతిరోజు ప్రత్యేక టీంలతో వాచ్ చేసేలా చర్యలు తీసుకున్నారు. అంబేద్కర్ స్టేడియం చుట్టూ 100 మీటర్ల దూరం వరకు సీఆర్‌పీసీ 144 సెక్షన్ అమలు పరుస్తున్నారు.

స్ట్రాంగ్‌రూంల భద్రతను అభ్యర్థులు పరిశీలించవచ్చు

అంబేద్కర్ స్టేడియంలో 42 నియోజకవర్గాలకు చెందిన బ్యాలట్ బాక్స్‌లను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూంలను పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు ఎప్పుడైనా పరిశీలించేందుకు అధికారులు అవకాశం కల్పించారు. స్ట్రాంగ్ రూంల వద్ద బద్రత కట్టుదిట్టంగా ఉందా? ఇంకేమైనా అనుమానాలుంటే సీసీ కెమెరాల ద్వారా నివృత్తి చేసుకోవచ్చు. 24 గంటల పాటు ఎల్‌సీడీ స్క్రీన్ అందుబాటులో ఉంటుంది. స్ట్రాంగ్ రూంల ముందు బిగించిన ప్రత్యేక సీసీ కెమెరాలతో అంబేద్కర్ స్టేడియం ప్రధాన ద్వారం బయట ఏర్పాటు చేసిన భారీ ఎల్‌సీడీ స్క్రీన్‌పై పరిశీలించే విధంగా ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలతో ఎన్నికల కమిషన్ కూడా ఏ సమయంలో అయినా నేరుగా స్ట్రాంగ్ రూంల వద్ద భద్రతను పరిశీ లించే ఏర్పాట్లు ఉన్నాయి. ఇదంతా ఎన్నికల సంఘం నియంత్రణలో ఉంటుంది.

కాగా బ్యాలట్ బాక్స్‌లను కరీంనగర్‌కు తరలిస్తున్న నిర్మల్ జిల్లాకు చెందిన 2 ఆర్టీసీ బస్సులు ఢీకొని 19 మంది ఎన్నికల సిబ్బంది జిల్లా సరిహద్దున జరిగిన ప్రమాదంలో గాయపడగా వారికి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

భవితవ్యం బ్యాలట్ బాక్స్‌లో..

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ముగియటంతో అభ్యర్థుల భవితవ్యం బ్యాలట్ బాక్స్‌ల్లో ఉంది. అటు అభ్యర్థులు ఎన్ని ఓట్లు సాధిస్తామనే లెక్కల్లో మునిగారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా ఎవరి లెక్కలు వారు చూసుకుంటూ మాకు ఆయా ప్రాంతాల్లో మద్దతు ఉందని, ఇంత ఓట్లు సాధిస్తామని లెక్కలు వేసుకుంటున్నారు. మరో వైపున అనుచరులు, కార్యకర్తలు కూడా అభ్యర్థులను కలుస్తూ మనకే అవకాశాలు అధికంగా ఉన్నాయంటూ విజయావకాశాలపై భరోసాఇచ్చే పనిలోపడ్డారు. నిన్నటి వరకు ప్రచారంలో మునిగితేలిన అభ్యర్థులు శుక్రవారం నుంచి ఓట్ల లెక్కల్లో మునిగిపోయారు.



స్ట్రాంగ్‌రూంకు సీల్ వేసిన అనంతరం కలెక్టర్‌తో అధికారులు

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్యకార్యదర్శి శాంతికుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి శాంతి కుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె ఇంటర్ పరీక్షల నిర్వహణ, ఎల్ఆర్‌ఎస్‌పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ మార్చి 5 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయన్నారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తయిందని, ప్రశ్నా పత్రాలు చేరుకున్నాయని, రేపటి నుంచి ప్రశ్నాపత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లో నుంచి పోలీసుస్టేషనకు చేరుతాయని అన్నారు. ప్రశ్నా పత్రాలను పోలీసు బందోబస్తు మధ్య తరలించడం జరుగుతుందని అన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమన్వయ సమావేశాలు జరిగాయని, అవసరమైన మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షలు నిర్వహించి సంబంధిత జవాబు పత్రాలు పోస్టల్ ద్వారా పంపే వరకు జిల్లాలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, విద్యార్థులను నిశితంగా చెక్ చేసిన తర్వాతనే లోనికి అనుమతించాలని, ఎట్టి పరిస్థితుల్లో కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చూడాలని అన్నారు.

పరీక్షా కేంద్రాల్లోకి ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బంది, విద్యార్థులెవరు సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకొని రావడానికి వీలు లేదని స్పష్టం చేశారు. తాగునీరు, విద్యుత్ సరఫరా పరీక్ష పూర్తయ్యే వరకు అయ్యేలా చూడాలని, ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని అన్నారు.

ఎల్ఆర్‌ఎస్‌లో 25 శాతం రుసుము మినహాయింపు

2020లో 25లక్షల ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయని, గత సెప్టెంబర్ 24లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కొన్ని దరఖాస్తుల క్రమబద్ధీకరణ మాత్రమే జరిగిందని అన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం కొన్ని నూతన నిర్ణయాలు తీసుకుందని అన్నారు. ఎల్ఆర్ఎస్ ప్లాట్ రిజిస్ట్రేషన్ సమయంలో రుసుము చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 31 వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుములో 25శాతం మినహాయింపు ఉంటుందని సమాచారం అందించామని అన్నారు.

2020 ఆగస్టు 26 వరకు 10శాతం ప్లాట్లు విక్రయించిన లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, సబ్ రిజిస్ట్రార్ ద్వారా నిర్ణీత నమూనాలో నూతన దరఖాస్తులు సేకరించి ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్‌శాఖకు వివరాలు పంపించి క్రమబద్ధీకరణ చేస్తామని అన్నారు. క్రమబద్ధీకరించని భూములలో ఎలాంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతించడం ఉండదని అన్నారు. మార్చి 31 వరకు ప్రభుత్వం అందించిన అవకాశాన్ని వినియోగించుకొని 25శాతం రాయితీ పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ పాల్గొన్నారు.

8న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేష్

కరీంనగర్ లీగల్, ఫిబ్రవరి 28: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ఈ నెల 8న జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి వెంకటేష్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సామావేశంలో అయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ చేయదగిన 3120 కేసులు గుర్తించినట్లు, వాటిలోని 1080 కేసులలో కక్షిదారులకు నోటీసులు పంపించడం జరిగిందని ఆయన తెలిపారు. సివిల్ కేసులు 489 గుర్తించి వాటిల్లో అందరికీ నోటీసులు పంపినట్లు అయన తెలిపారు. నోటీసులు అందుకున్న లోక్ అదాలత్‌కు కేసులు రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. లోక్ అదాలత్‌తో కేసులు రాజీ ద్వారా సత్వర పరిష్కారంతో పాటు సమయం, డబ్బు వృధా కాకుండా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ తీర్పులకు అప్పీలు ఉండదని ఆయన తెలిపారు. రాజీ చేదగిన క్రిమినల్, సివిల్, ఫ్యామిలీ, బ్యాంక్, మోటార్ ప్రమాద కేసులతో పాటు, చెక్ బౌన్స్, డ్రంకెన్‌డ్రైవ్, ట్రాఫిక్ చలాన్‌లతో పాటు కోర్టుకు రాని కేసులను కూడా పరి ష్కరించనున్నట్లు ఆయన తెలిపారు. లోక్ అదాలత్‌లను సద్వినియోగ పరుచుకోవాలని ఆయన సూచించారు.

మూడేళ్లు కావస్తున్నా మోక్షం లేదు

- అటకెక్కిన అభివృద్ధి పనులు
- నిలిచిపోయిన సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు పనులు

చొప్పదండి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మూడేళ్లు కావస్తున్నా పనులు పూర్తి కాలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన అభివృద్ధి పనులు అటకెక్కాయి. రోడ్డు వెడెల్పు పనులు అర్థంతరంగా నిలిచిపోగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది రూపాయలతో చేపట్టిన పనులు పూర్తి చేస్తారని భావించిన ప్రజలకు ఎదురుచూపులు తప్పడం లేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎంతో హడావిడి చేసిన పాలకులు ఆ తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదు.

నిలిచిపోయిన పనులు

చొప్పదండి పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరించేందుకు 2021లో అప్పటి ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. పట్టణంలోని గుమ్లాపూర్ క్రాస్ రోడ్డు నుంచి డి86 కాల్వ వరకు నాలుగు కిలోమీటర్ల మేరకు రాయపట్నం రహదారిని విస్తరించి, నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయాలని సంకల్పించింది. సెంట్రల్ లైటింగ్‌తో రెండువైపులా మురికి కాల్వలు, ఫుట్ పాత్‌లను నిర్మించాలని 33 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పాటు పట్టణంలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల కోసం ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించాలని రెండు కోట్ల రూపాయలను మంజూరు చేసింది. 2022 మార్చి మొదటి వారంలో అప్పటి మున్సిపల్ ఐటి శాఖ మంత్రి కేటీఆర్ పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ఎవరు ముందుకు రాకపోగా ఏడాది తర్వాత 2023 మార్చ్‌లో పనులను ఓ కాంట్రాక్టర్ మొదలు పెట్టాడు.



చొప్పదండిలో నిలిచిపోయిన రోడ్డు వెడల్పు పనులు



నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం

ఇరుకు రోడ్డుతో ఇబ్బందులు

పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ రోడ్డును రెండు వైపులా అభివృద్ధి చేయకుండా ఉన్న రోడ్డులో మధ్యలో డివైడర్‌ను నిర్మించి వదిలిపెట్టాడు. 2023 సెప్టెంబర్ నెలలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. రోడ్డు కాస్త ఇరుకుగా మారి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. దాదాపు ఏడాదిన్నర కింద అభివృద్ధి పనులు నిలిచిపోగా ఇప్పటి వరకు పనులలో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది. పట్టణవాసుల చిరకాల వాంఛ సెంట్రల్ లైటింగ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు నిలిచిపోగా వర్షాకాలంలో ప్రజలు పడ్డ బాధలు వర్ణనాతీతం. ఇప్పటికైనా ప్రధాన రహదారిని అభివృద్ధి చేసి సెంట్రల్ లైటింగ్ పనులను ప్రారంభించి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై కరీంనగర్ ఫైర్ స్టేషన్ అధికారులు శుక్రవారం కరీంనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వచ్చిన సమయంలో ఏ విధంగా ఆర్పి వేయాలని ఫైర్ సిబ్బంది ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఫైరింజన్ ఏ విధంగా మంటలను ఆర్పివేస్తుందని ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఫైర్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

విశ్రాంత ప్రొఫెసర్ సైండ్ల అంజయ్య మృతి


సైండ్ల అంజయ్య(ఫైల్)

గన్నేరువరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా సుదీర్ఘ కాలం పనిచేసి పదవీవిరమణ పొందిన ప్రొఫెసర్, డాక్టర్ సైండ్ల అంజయ్య(75) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. సైండ్ల అంజయ్య స్వస్థలం గన్నేరువరం మండలకేంద్రం. ఆయన గన్నేరువరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు విద్యాభ్యాసం చేశాడు. ఆ తరువాత ఎలగందల్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ఏడవతరగతి చదువుకుని పైతరగతులు అక్కడ లేకపోవడంతో హైదరాబాద్ పట్టణానికి చేరుకున్నాడు. అక్కడ ఆయన ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఒక హోటల్‌లో క్లీనర్‌గా పనిచేస్తూ అక్కడి ప్రభుత్వ పాఠశాలలో పదవతరగతి పూర్తిచేశాడు. ఆ తరువాత ఉన్నత చదువులు చదివి సెక్రెటేరియట్‌లో టైపిస్ట్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. కొద్దిరోజుల తరువాత ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉద్యోగంలో స్థిరపడి సుదీర్ఘకాలం పనిచేసి కొన్నేళ్ల కిందటే పదవీ విరమణ పొందారు. డాక్టర్ సైండ్ల అంజయ్య పలుడిగ్రీలు, డిప్లొమాలు, డాక్టరేట్, లా చదివి ఎన్నో విజయాలను సాధించి గన్నేరువరం గ్రామానికి ఆదర్శంగా నిలిచారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని విజయాలను సాధించాలని స్థానికులు పేర్కొంటూ ఆయనకు నివాళులు అర్పించారు.

కుంభమేళాకు వెళ్లిన మంథని వాసులకు రోడ్డు ప్రమాదం

● పలువురికి గాయాలు

మంథని, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళకు వెళ్లిన మంథని వాసులులో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈమేరకు బాధిత కుటుంబసభ్యులకు శుక్రవారం రాత్రి సమాచారం అందింది. స్థానిక హనుమాన్‌నగర్‌కు చెందిన మిర్యాల సాగర్ తన కుటుంబసభ్యులు, మరికొందరు యువకులతో కలిసి నాలుగురోజులక్రితం సొంతకారులో కుంభమేళాకువెళ్లారు. కుంభమేళాలో పుణ్యస్నానాల అనంతరం తిరుగు ప్రయాణంలో ప్రయాగ్‌రాజ్‌కు సమీపంలో తెల్లవారుజామున 4గంటలప్రాంతంలో కారు వేగంగా అదుపుతప్పి రోడ్డు పక్కఉన్న చెట్టును ఢీకొనగా కారులోని సాగర్‌కుతోపాటు మరికొందరికి గాయాలైనట్లు సమాచారం. వీరిరందని సమీపంలోని స్రైహాఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు సమాచారం. అయితే ప్రమాదానికి గురైన వారి సెల్‌ఫోన్లు పనిచేయకపోవడం, స్థానికపోలీసుకు ఎలాంటిసమాచారం లేక పోవడంతో ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియడం లేదు.

సదరం సేవలు మరింత సులభతరం



● 21 రకాల కేటగిరీలను చేర్చిన కేంద్ర ప్రభుత్వం
● నేటి నుంచి రాష్ట్రంలో అందుబాటులోకి యూడీఐడీ పోర్టల్
● ఇక నుంచి స్మార్ట్ కార్డులు జారీ

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సదరం సేవలు మరింత సులభతరం కానున్నాయి. స్వయంగా దివ్యాంగులే దరఖాస్తు చేసుకునేలా కేంద్రం కొత్తగా యూనిక్ డిసేబిలిటీ ఐడెంటిటీ కార్డు (యూడీఐడీ) పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రంలో శనివారం నుంచి యూడీఐడీ పోర్టల్ అందుబాటులోకి రానుంది. ఈ పోర్టల్‌లో సదరం సర్టిఫికెట్ లేని వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. సమగ్ర వివరాలతో పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో ఆధార్‌కార్డు లేదా మరేదైనా గుర్తింపుకార్డును అప్‌లోడ్ చేయాల్సి వస్తుంది. అనంతరం సదరం శిబిరం జరిగే స్థలాన్ని ఎంపిక చేసుకొని దరఖాస్తు సబ్మిట్ చేస్తే సరిపోతుంది. ఆ దరఖాస్తును అధికారులు పరిశీలించి క్యాంపునకు ఎప్పుడు హాజరు కావాలనే వివరాలను దరఖాస్తుదారుడి ఫోన్‌కు పంపుతారు. శిబిరం లో వైద్యులు రిపోర్టులు పరిశీలించి అంగవైకల్యాన్ని నిర్ధారిస్తారు. అనంతరం దరఖాస్తు ఏ స్థాయిలో ఉందో తెలుసుకునే అవకాశం పోర్టల్‌లో ఉంటుంది. అయితే ప్రభుత్వం ఈ పోర్టల్‌పై ట్రయల్ నిర్వహిస్తున్నది.

స్మార్ట్ కార్డులు

సదరం సర్టిఫికెట్లు ఇప్పటి వరకు ఏ4 పేపర్ మీద ఇస్తున్నారు. ఇకపై స్మార్ట్ కార్డుపై ఐడీ నంబర్‌తో పాటు లబ్ధిదారుడి ఫొటో, పేరు, వైకల్యం రకం, వైకల్యం శాతం వివరాలు ఉంటాయి. స్మార్ట్ కార్డును పోస్ట్ ద్వారా ఇంటికి పంపిస్తారు. ఇప్పటికే సదరం సర్టిఫికెట్లు ఉన్న వారికి కూడా స్మార్ట్ కార్డులు జారీ చేయనున్నారు. ఇప్పటివరకు మీ సేవ కేంద్రాలలో సదరం స్లాట్ నమోదుకు కేవలం ఐదు రకాల కేటగిరీల వారికే అవకాశం ఉండేది. ఇప్పుడు కేంద్రం కొత్తగా రూపొందించిన యూడీఐడీ పోర్టల్‌లో మొత్తం 21 రకాల కేటగిరీలను చేర్చింది.

ఇందులో ప్రధానంగా తలసేమియా, ఆటిజం, యాసిడ్, న్యూరో బాధితులు కూడా సదరం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులకు వైకల్య శాతం తెలియజేసేందుకు జారీ చేస్తున్న సదరం ధ్రువపత్రాల స్థానంలో కొత్తగా యూనిక్ డిసేబిలిటీ ఐడెంటిటీ కార్డు జారీ చేయనున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలలో ఇవి అందుబాటులో ఉండగా మన రాష్ట్రంలో శనివారం నుంచి అందు బాటులోకి రానున్నాయి. ఇక నుంచి సదరం శిబిరానికి వచ్చే దివ్యాంగులందరికీ అందజేయనున్నారు. వైకల్య శాతం ఆధారంగా నిర్ధారిత రంగులో జారీ చేస్తారు. ఒక్కసారి వస్తే మళ్లీ పునరుద్ధరించుకోవాల్సిన అవసరం ఉండదు. కాగా ఇప్పటి వరకు ఇచ్చిన సదరం ధ్రువపత్రాలు మన రాష్ట్రంలోనే పని చేస్తున్నాయి. కానీ ఇప్పుడు ఇచ్చే కార్డులు ఇతర రాష్ట్రాలలో కూడా పనిచేస్తాయి. రైళ్లు, బస్సుల్లో రాయితీతో పాటు దివ్యాంగులకు సంబంధించిన అన్ని రాయితీలను పొందవచ్చు.

డిజిటల్ సంతకాలు

దివ్యాంగులు ఎప్పటిలాగే సదరం శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది. ఇందు కోసం స్మార్ట్ ఫోన్ నుంచి యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అవగాహన లేని వారు మీ-సేవ కేంద్రాల నుంచి చేసుకోవచ్చు. పరీక్షల అనంతరం ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేస్తారు. దివ్యాంగుల పూర్తి వివరాలు, వైకల్యం శాతం వైద్యుల లాగిన్‌కు చేరుతుంది.

ఒకసారి వివరాలు అన్ని సరిగా ఉన్నాయో లేదో అని సరిచూసుకుని అప్‌లోడ్ చేయగానే కార్డు మంజూరు అవుతుంది. కార్డుపై డిజిటల్ సంతకం ఉంటుంది. ఇవి పోస్టు ద్వారా దరఖాస్తుదారుడికి పంపిస్తారు. ఒకసారి వైకల్యం శాతం నమోదు అయితే దానిని పెంచడం లేదా తగ్గించడం ఉండదు. దాని ప్రకారమే ప్రభుత్వం పింఛను మంజూరు చేస్తుంది.

దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి
పీడీ రఘువరణ్



దివ్యాంగులు యూడీఐడీ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి. సదరం ధ్రువపత్రాల స్థానంలో కొత్తగా యూనిక్ డిసేబిలిటీ ఐడెం టిటీ కార్డు జారీ చేయనున్నాం. వైకల్య శాతం ఆధారంగా నిర్ధారిత రంగులో స్మార్ట్ కార్డులు జారీ చేస్తాం.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


ప్రవీణ్ (ఫైల్)

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, మైక్రోఫైనాన్స్‌లో అప్పుల వేధింపులతో శుక్రవారం సాయంత్రం తంగళ్లపల్లి మండలం కేసీఆర్(డబుల్ బెడ్ రూం)నగర్‌లో గరికె ప్రవీణ్(30) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రవీణ్ గతంలో పెయింటర్‌గా పనిచేస్తూ జీవనం సాగించాడు. పెయింటర్‌గా సరైన పని దొరకకపోవడంతో సిరిసిల్లలోని కిరాణా దుకాణంలో పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఇదేక్రమంలో మైక్రో ఫైనాన్స్‌లో తీసుకున్న రుణానికి సంబంధించిన వాయిదాలు చెల్లించాలంటూ నిర్వాహకులు ఇబ్బందులు పెట్టినట్లు తెలిసింది. ఆర్థిక ఇబ్బందులు, వేధింపులతో మానసికంగా కుంగిపోయిన ప్రవీణ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య గాయత్రి, కుమారుడు గౌతమ్, కూతురు నిఖిత ఉన్నారు.

ఒంటరి జీవితంపై విరక్తి చెంది ఒకరు..


రాజ్‌కుమార్ (ఫైల్)

మల్లాపూర్, ఫిబ్రవరి, 28 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్‌కు చెందిన ముచ్చుకుర్తి రాజ్‌కుమార్(32) అనే యువకుడు ఒంటరి జీవితంపై విరక్తి చెంది తాగుడుకు బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్ర వారం ఎస్ఐ రాజు తెలిపారు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజ్‌కుమార్‌కు నాలుగేళ్ల క్రితం వివాహం కాగా విడాకులై ఒంటరిగా ఉంటున్నాడు. దీంతో తాగుడుకు బానిస య్యాడు. స్థానిక జాతరకు వెళ్తానని చెప్పి వెళ్లిన రాజ్‌కుమార్ ఎంతకూ తిరిగి రాలేదు. అతడి కోసం తండ్రి, బంధువులు ఆరా తీయగా మల్లాపూర్ శివారులో గల ఎల్లమ్మ చెరువు వద్ద చింతచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రసవం కోసం వెళ్లిన గర్భిణి మృతి

● పల్లిమక్తలో విషాదం


సోని(ఫైల్)

కోనరావుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తొలి ప్రసవం కోసం వెళ్లిన ఓ గర్భిణి చికిత్సపొందుతూ శుక్రవారం మృతి చెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. కోన రావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన వంకాయల పద్మ-నాగయ్యల కూతురు సోని(22)ని 10నెలల క్రితం మండలంలోని పల్లిమక్తకు చెందిన సిద్రవేణి బాబుకు ఇచ్చి వివాహం చేశారు. సోని తొమ్మిది నెలల గర్భవతి కావడంతో పురిటినొప్పులు రాగా బుధవారం వేములవాడ ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. వైద్యులు అందుబాటులో లేరని తెలియడంతో అదే రోజు కొండాపూర్‌కు వచ్చారు. గురువారం పల్లిమక్త ఆశావర్కర్ కనక లక్ష్మిని తీసుకొని ప్రసవం కోసం వేములవాడ ఏరియా ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షిస్తున్న సమయంలో ఫిట్స్ రావడంతో కరీంనగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి తల్లీబిడ్డ ఆరోగ్యం విషమంగా ఉందని హైదరాబాదులోని గాంధీఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కడుపులోనే శిశువు మృతిచెందిందని, తల్లిని రక్షించే ప్రయత్నం చేస్తామని చెప్పి ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ తర్వాత తల్లి కూడా మృతిచెందడంతో పల్లిమక్త గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. తొలి కాన్పులో తల్లీబిడ్డ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పూర్తి వివరాలు పోస్టుమార్టం తర్వాత తెలుస్తాయని వైద్యులు చెబుతున్నారు.

ఈతకు వెళ్లి ఆర్టీసీ డ్రైవర్ మృతి


తిరుపతిరావు(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని మానేరు జలాశయంలో ఈతకువెళ్లిన కటారి తిరుపతిరావు(59) అనే ఆర్టీసీడ్రైవర్ ప్రమాదవశాత్తు కాళ్లకు చేపల వల చిక్కుకొని శుక్రవారం నీటమునిగి మృతి చెందాడు. కొత్తపల్లి పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. కరీంనగర్ అల్కాపురి కాలనీలో నివాసం ఉంటున్న తిరుపతి రావు కోరుట్ల ఆర్టీసీడిపోలో డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కొద్ది రోజుల నుంచి విధులకు వెళ్లడం లేదు. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన తిరుపతిరావు 7:30గంటల ప్రాంతంలో మానేరు జలాశయంలోకి ఈత కోసం దిగాడు. 500మీటర్ల దూరం వరకు ఈదుకుంటూ వెళ్లాడు. తిరిగి ఒడ్డుకువస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు చేపల వల కాళ్లకు చుట్టుకుంది. ఒడ్డుకు చేరుకునేందుకు ప్రయత్నించినా సాధ్యంకాక అక్కడే నీట మునిగిపోయాడు. గమనించిన కొందరు వెంటనే జాలర్లకు, సేఫ్‌వింగ్‌లో పనిచేసిన ఆనంద్‌కు సమాచారం అందించారు. ఆనంద్‌టీం బోట్ల సహాయంతో సంఘటన స్థలంలో వెదికినా ప్రయోజనం లేకుండా పోయింది. మధ్యాహ్నం సమయంలో తిరుపతిరావు మృతదేహం లభ్యమైంది. మృతుడి కొడుకు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని మాతాశిశు కేంద్రం వద్ద గుర్తుతెలియని వృద్ధుడు(65) మృతి చెందినట్లు కరీంనగర్ ప్రభుత్వాస్పత్రి అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుళ్లు కె.రవీందర్, ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. గురువారం రాత్రి 1:30గంటల సమయంలో వృద్ధుడు మృతి చెంది పడి ఉండడాన్ని గమనించి మార్చురీ గదిలో భద్రపరిచామని పేర్కొన్నారు. మృతుడు కొద్దిరోజులుగా ప్రభుత్వాస్పత్రి, మాతాశిశుకేంద్రం వద్ద పుట్‌పాత్‌పై పడుకునేవాడని తెలిపారు. మృతుడిని గుర్తించినవారు కరీంనగర్ టూటౌన్ సీఐ 8712670762, హెడ్‌కానిస్టేబుల్ రవీందర్ 9491481433కి సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ఎస్సారార్ అధ్యాపకుడికి జాతీయస్థాయి ఉత్తమ పరిశోధకుడు అవార్డు


శ్రీనివాసును అభినందిస్తున్న లెక్చరర్లు

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిసైన్స్ దినోత్సవం సందర్భంగా ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్‌సైన్స్ కళాశాల వృక్షశాస్త్ర విభాగాధిపతి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ తిరుక్కోవల శ్రీనివాస్ ఐటుఓఆర్ సంస్థ జాతీయ పరిశోధక ఎక్స్‌లెంట్ అవార్డు 2025ను శుక్రవారం హైదరాబాద్‌లో ఉన్నతవిద్య సంయుక్త సంచాలకుడు డాక్టర్‌రాజేంద్రసింగ్, డాక్టర్‌యాదగిరి అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్వకుంట రామకృష్ణ, వైస్‌ప్రిన్సిపాల్ పినితిన్, డాక్టర్ తాళ్లపల్లి రాజయ్య అభినందించారు. తెలంగాణ డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి, వృక్షశాస్త్ర విభాగ సహాయ ఆచార్యులు డాక్టర్ రౌతు రాధాకృష్ణ అభినందనలు తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో వ్యక్తికి 6 నెలల జైలు శిక్ష

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వ్యక్తి రాగుల బాల్‌రెడ్డికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ఒకటవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సృజన తీర్పు వెల్లడించారని కోర్టు కానిస్టేబుల్ శంకర్ శుక్రవారం పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని నంది కిషన్, రాగుల బాల్‌రెడ్డి స్నేహితులు. కొన్నినెలల క్రితం బాల్‌రెడ్డి తన అవసర నిమిత్తం నంది కిషన్‌వద్ద రూ.5లక్షలు తీసుకున్నాడు. డబ్బులు చెల్లించాలని నంది కిషన్ కోరడంతో రెండు చెక్కులను అందజేశాడు. బ్యాంకులో జమ చేయగా బాల్‌రెడ్డి అకౌంటులో డబ్బులు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయ్యాయి. దాంతో కిషన్ కోర్టు ద్వారా నోటీసులను పంపించాడు. బాల్‌రెడ్డి నుంచి స్పందన లేకపోవడంతో కిషన్ కోర్టును ఆశ్రయించాడు. పూర్వాపరాలు పరిశీలించిన మేజిస్ట్రేట్ సృజన నిందితుడు బాల్‌రెడ్డికి ఆరునెలలు జైలుశిక్ష విధించడంతోపాటు రూ.5లక్షలు బాధితుడికి చెల్లించాలని తీర్పునిచ్చారు.

ఆటో డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

గంభీరావుపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : అతివేగంగా ఆటో నడిపి చిన్నారి మృతికి కారణమైన ఆటో డ్రైవర్‌కు ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ.4100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల అదనపు ప్రథమశ్రేణి మేజిస్ట్రేట్ కావేటి స్పందన శుక్రవారం తీర్పు చెప్పారని స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. 2016 జూన్29న గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన చిన్నారి గుగులోతు సంజన(7) తన ఇంటి ఎదుట నిలబడి ఉండగా గంభీరావుపేటకు చెందిన ఆటో డ్రైవర్ లింగంపల్లి శ్రీనివాస్ అతివేగంగా వచ్చి సంజనను ఢీకొట్టడంతో మృతిచెందింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి లింగంపల్లి శ్రీనివాస్‌ను రిమాండ్‌కు తరలించారు. కోర్టులో పీపీ సతీష్‌గౌడ్ వాదించగా, కోర్టు కానిస్టేబుల్ జనార్దన్ సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధించారు.

ఆటో, కారు ఢీ

● పలువురికి గాయాలు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న రగుడు చౌరస్తాలో శుక్రవారం ఆటోను కారు ఢీకొని పలువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల నుంచి వేములవాడకు వెళుతున్న ఆటోకు వేములవాడ నుంచి సిరిసిల్ల వైపు అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సిరిసిల్లకు చెందిన కవిత(35), గీత(30), రిషి(3), దుబ్బాకకు చెందిన నర్సయ్యకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను చికిత్సకోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

● ఎన్నికల సిబ్బంది 19మందికి గాయాలు
● కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స


ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు

కరీంనగర్‌క్రైం/కొడిమ్యాల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ముగిసిన తరువాత బ్యాలట్ బాక్స్‌లను కరీంనగర్‌కు తరలించి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 19 మంది ఎన్నికల సిబ్బంది గాయపడ్డట్లు కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్ జిల్లాకుచెందిన రెండు ఆర్టీసీ బస్సుల్లో అక్కడి బ్యాలట్‌బాక్స్‌లను ఎన్నికల సిబ్బంది గురువారం రాత్రి కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో స్ట్రాంగ్ రూంకు చేర్చారు. అనంతరం తిరిగి నిర్మల్‌కు వెళుతున్న క్రమంలో వేకువజామున 3గంటల ప్రాంతంలో జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం తురుకకాశీనగర్ ప్రాంతంలోని రైల్వేగేట్ వద్ద ఒకదాని వెనుక మరొక బస్సు ఢీకొన్నాయి. దీంతో వెనుక బస్సులో ఉన్న 19మందికి గాయాలయ్యాయి, బస్సు డ్రైవర్ ఎండీ నయీమొద్దీన్ కాలు విరిగింది. రెవెన్యూ ఉద్యోగి పురుషోత్తంకు కడుపు, ఛాతీ భాగంలో దెబ్బలు తగలటంతో వీరిద్దరినీ ప్రభుత్వఆసుపత్రిలోని ఐసీయూలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. మిగతా 17 మంది ఉద్యోగులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరికి వైద్యం అందిస్తున్నారు. గాయపడిన ఉద్యోగులను నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ ఆసుపత్రిలో పరామర్శించి, మెరుగైన వైద్య సహాయం అందించాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు.


కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డ్రైవర్ ఎండీ నయీమొద్దీన్, ఎన్నికల సిబ్బంది

కత్తులతో యువకుల వీరంగం

● ఇద్దరికి గాయాలు... ద్విచక్ర వాహనం ధ్వంసం

కోరుట్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం యువకులు కత్తులతో వీరంగం సృష్టించారు. దుకాణంలోకి కస్టమర్లు రాకుండా రోడ్డుకు అడ్డంగా పానిపూరి బండి పెడుతున్నావని బండి యజమానిని ప్రశ్నించగా ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి కత్తులతో దాడికి దారితీసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొత్త బస్టాండ్ ప్రాంతంలోని హనుమాన్ వ్యాయామశాలలోని దుకాణ సముదాయంలో ముత్యాల సుమత్, అతడి సోదరుడు రేవంత్‌లు సెలూన్ దుకాణం నడుపుతున్నారు. దుకాణ సముదాయం వెళ్లే దారి వద్ద ప్లాట్ ఫారంపై రాజస్థాన్‌కు చెందిన ప్రేమ్ అనే వ్యక్తి పానిపూరి బండి నడుపుకుంటున్నాడు. సుమత్, అతడి సోదరుడు తమ దుకాణంలోని కస్టమర్లు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని బండిని అక్కడి నుంచి తీయాలని తరచుగా గొడవ పడేవారు. ఇదే క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ప్రేమ్‌ను సుమత్ అతడి సోదరుడు రేవంత్‌లు దారి విషయంలో గొడవ పడ్డారు. దీంతో పక్కనే ఉన్న కొబ్బరి బోండా బండి వద్దకు వెళ్లిన సెలూన్ యజమానులు మొదట అక్కడ కత్తితో ప్రేమ్‌పై దాడి చేయడానికి ప్రయత్నించగా తేరుకున్న ప్రేమ్ తన బండిలో పెట్టుకున్న కత్తిని తీసి ఇద్దరిపై దాడి చేసినట్లు తెలిపారు. దీంతో సుమత్, రేవంత్‌లు స్వల్ప గాయాల పాలయ్యారు. అదే దుకాణ సముదాయంలో ఉన్న ఓ ద్విచక్ర వాహనం దాడిలో ధ్వంసమైంది. పోలీసులు అక్కడికి చేరుకోగా ప్రేమ్ కత్తితో తన స్నేహితుల ద్విచక్రం వాహనంపై పరారయ్యాడు. గాయపడిన సుమత్, రేవంత్‌లను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. సుమత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు.

విధుల్లోకి తీసుకోవాలని ఆత్మహత్యాయత్నం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): తనను విధుల్లోకి తీసుకోవాలని కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద శుక్రవారం ఆర్టీసీ డిపో-1 డ్రైవర్ జి.సురేష్(45) ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడే ఉన్న ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. 2023 సెప్టెంబరు 24న ఆర్టీసీ హైర్ బస్ డ్రైవర్‌గా పని చేస్తున్న సురేష్‌కు ఆర్టీసీ అధికారులు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా మోతాదుకు మించి మద్యం తాగినట్లు వెల్లడైంది. అధికారులు విధుల నుంచి టర్మినేట్ చేశారు. తనకు చిన్న పిల్లలున్నారని, తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సురేష్ ఆత్మహత్యకు యత్నించాడని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో ఆర్టీసీ డ్రైవర్‌పై ఒకటో టౌన్‌లో పోలీసులు కేసు నమోదు చేశారు.

దుర్శేడ్ 'మీసేవా' కేంద్రంలో విజిలెన్స్ పోలీసుల తనిఖీలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామ పరిధిలోని మీ సేవా కేంద్రంలో శుక్రవారం విజిలెన్స్ పోలీసులు తనిఖీలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగాయి. రాష్ట్ర వ్యాప్తంగా మీ సేవా కేంద్రాల్లో జిల్లాకు ఒకటి వంతున తనిఖీ చేసినట్లుగా తెలుస్తోంది. ధరణిలో అవకతవకలు, మీ సేవాకేంద్రాల ద్వారా పహాణీ నకల్, పాస్‌బుక్ 1బీ, రెవెన్యూ కార్యాలయం నుంచి జారీ అయిన ఇతర ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసు కున్నారు. కొంతకాలంగా మీ సేవా కేంద్రం నుంచి జారీచేసిన సర్టిఫికెట్లు, ఇతర ఆన్‌లైన్ లావాదేవీలను పరిశీలించి నట్లు తెలిసింది. మీసేవా కేంద్రానికి వచ్చిన దర ఖాస్తులు, ఫీజు చెల్లింపులు తదితర విషయాలకు సబంధించి వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. తనిఖీలపై విజిలెన్స్ పోలీసు అధికారులను సంప్రదించగా సమాచారం ఇచ్చేందుకు నిరాకరించారు.

మాజీ సర్పంచ్‌పై దాడి

రాయికల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని రామారావుపల్లె మాజీ సర్పంచ్ బీర మల్లయ్యపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. మల్లయ్య ద్విచక్ర వాహనంపై రాయికల్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఇటిక్యాల గ్రామ శివారులో దాడి చేశారు. ఈ దాడిలో మల్లయ్య చేతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జగిత్యాల ఆస్పత్రికి తరలించారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సుదీర్‌రావు తెలిపారు.

రేణుక ఎల్లమ్మ గుడి ప్రహరీ కూల్చివేత

● గౌడ కులస్తుల ఆందోళన


కూల్చిన ప్రహరీని పరిశీలిస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

సుల్తానాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రహరీని కూల్చివేసిన వారిపై కఠినచర్యలు తీసుకుకోవాలని గౌడకులస్తులు శుక్రవారం ఆదోళన నిర్వహించారు. మహిళలు తమ కుటుంబ సభ్యులతో వచ్చి రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద నిరసన తెలిపినిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. గౌడకులస్తులు తమ కుటుంబ సభ్యులతో కలసి రాజీవ్‌రహదారిపై ధర్నా చేయడానికి ప్రయత్నం చేయడంతో ఎస్ఐ శ్రావణ్ కుమార్ జోక్యం చేసుకుని గోడ కూల్చివేసిన వారిని పట్టుకుంటామని తగినచర్యలు తీసుకుంటామని హామీఇవ్వడంతో ధర్నా విరమించారు. దేవాలయంవద్ద జరిగిన సంఘటనను ఎస్ఐ శ్రావణ్ తదితరులు పరిశీలించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల సూచనలమేరకు కేసు నమోదు చేస్తామని, ప్రహరీకూల్చిన వారిని పట్టుకునిచర్యలు తీసుకుంటామన్నారు.

ప్రహరీనిఆరెల్లి చంద్రయ్య అనేవ్యక్తి ఎక్స్‌కావేటర్‌తో పూర్తిగా ధ్వంసం చేశాడని అతడిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో పట్టణ గౌడ సంఘంనేతలు గడ్డంఅంజయ్య, సత్తయ్య అంతటి లచ్చయ్య, మంద మల్లయ్య, పొన్నం తిరుపతి, కొయ్యడ వెంకటేశ్, శ్రీనివాస్, జాగిరి మొగిలి, ప్రభాకర్ గౌడ్, సుల్తానాబాద్ మాజీ సర్పంచ్ అంతటి పుష్పలత, మున్సిపల్ మాజీచైర్‌పర్సన్ ముత్యం సునీత ఉన్నారు.

మహాశివరాత్రి ఆదాయం రూ.1.31 కోట్లు

● ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి):వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన మహాశివరాత్రి జాతరకు ఆయా ఆర్జిత సేవల ద్వారా కోటి 31,89,177 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో వినోద్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరం దాదాపు 11లక్షల ఆదాయం అదనంగా వచ్చినట్లు పేర్కొన్నారు. అధికంగా ప్రసాదాల విక్రయాలతో రూ.57,12,660 సమకూరగా, కోడె ముక్కుల ద్వారా రూ.45,83,500, ఆర్జిత సేవల ద్వారా రూ.55,706, కేశఖండనాల ద్వారా రూ.3,89400, వంద రూపాయల శీఘ్రదర్శనం ద్వారా రూ.6,97,700, అతిశీఘ్రదర్శనం ద్వారా రూ.13,04,100, బద్దిపోచమ్మ ఆలయం నుంచి రూ.1,91,390, భీమేశ్వర ఆలయం ద్వారా రూ.78,785, నగరేశ్వర ఆలయం ద్వారా రూ.7,830, వసతిగదుల ద్వారా రూ.1,05,280, ఇతర సేవల ద్వారా రూ.62,696 సమకూరినట్లు ఈవో వివరించారు. గతసంవత్సరం రూ.1,20,98704 సమకూరగా, ఈ సంవత్సరం రూ.1,31,89,117 ఆదాయం వచ్చింది. గతంకంటే ఈ సంవత్సరం రూ.10,90,473 అదనపు ఆదాయం వచ్చింది.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాధారణ భక్తుల రద్దీ నెలకొన్నది. వివిధప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కళ్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకొని ఆయా క్యూ లైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకొని పార్వతీరాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకుని అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం పద్మశాలీ మహాసభలు





మాట్లాడుతున్న కందగట్ల కుమారస్వామి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పద్మశాలి సమస్యలు, హక్కుల సాధనకోసం మహాసభలు ఏర్పాటు చేసినట్లు అఖిల భారత పద్మశాలీసంఘం జాతీయఅధ్యక్షుడు కందగట్ల కుమార స్వామి, రాష్ట్ర అధ్యక్షుడు కామార్తపు మురళి తెలిపారు. శుక్రవారం నగరంలోని పద్మశాలి ట్రస్టుభవన్‌లో జిల్లాస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంగా, సామాజికంగా పద్మశాలీలు చైతన్యవంతం అయ్యేందుకు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బలోపేతానికి మహాసభలు దోహదపడతాయన్నారు. బీసీకులగణన ద్వారా పద్మశాలీల్లో చైతన్యం వచ్చిందని, రాష్ట్రవ్యాప్తంగా 13లక్షల మంది పద్మశాలీలు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. మహాసభల అనంతరం పద్మశాలీ భరోసా కార్యక్రమాన్ని తెలంగాణప్రాంత పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పది లక్షల మందితో గ్రూపు ఏర్పాటు చేసి పదిరూపాయల చొప్పున జమచేసి బ్యాంకుఖాతా తీయనున్నామన్నారు. నిరుపేద పద్మశాలీలకు చేయూతనిందించేందుకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 17వ అఖిల భారతపద్మశాలీ మహాసభతోపాటు 8వతెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం మహాసభలను హైదరాబాద్‌లోని పద్మశాలీ భవన్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. మార్చి9న హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లక్షమందితో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అఖిలభారత పద్మశాలీసంఘం ప్రధానకార్యదర్శి గడ్డం శ్రీరాములు, రాష్ట్ర పద్మశాలీ సంఘం ప్రధానకార్యదర్శి రామచంద్రరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు వాసాల రమేశ్, అధ్యక్షుడు మెతుకు సత్యం, ప్రధానకార్యదర్శి వల్లాల కృష్ణహరి, కోశాధికారి అల్లా భద్రయ్య, రాష్ట్రమీడియా ప్రధానకార్యదర్శి మార్త ప్రకాశ్, ట్రస్టు అధ్యక్షుడు స్వర్గం మల్లేశం, పట్టణ అధ్యక్షుడు గడ్డం శ్రీరాములు, యువజన సంగం అధ్యక్షుడు శ్రీకాంత్, మిట్టపల్లి ప్రవీణ్‌కుమార్, చొప్పరిజయశ్రీ, మంచికట్ల కోటేశ్వర్, గడ్డం వెంకటేశ్వర్లు, చేరాల మల్లికార్జున్ దేవ్, వోడ్నాల రవీందర్, స్వర్గం నర్సయ్య, వేముల చంద్రశేఖర్, దీకొండ లక్ష్మీనారాయణ, మెతుకు కృష్ణచైతన్య, వంగర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపుపై ఆశలు

● ఎవరి ధీమాలో వారే ● ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ





(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ముందెన్నడూ లేని విధంగా అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలను తలపించేలా జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల ఫలితా లపై సర్వత్రా ఉత్కంఠ నెలకొన్నది. బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ మధ్య నువ్వా..నేనా అన్నట్లు సాగిన పోరులో విజయం ఎవరిని వరించను న్నదోనని ప్రజలు ఆసక్తిగా చర్చించుకుంటుండగా తామే గెలుస్తామని ఎవరికివారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. హోరాహోరీగా సాగిన ముక్కోణపు పోటీలో మొదటి, రెండు స్థానాల్లో నిలిచేదెవరూ.. మూడో స్థానంలో ఉండేదెవరూ.. అన్నదానిపైనే అన్ని రాజకీయ పార్టీలు కూడికలు.. తీసివేతలతో తలపడుతున్నాయి.

తొలి ప్రాధాన్యత ఓటుతో ఎవరు గెలిచే అవకాశం లేదన్నది స్పష్టంగా తేలిపోయింది. తొలి ప్రాధాన్యత ఓటుతో అభ్యర్థి విజయం సాధించాలంటే పోలై న ఓట్ల లో చెల్లిన ఓట్లలో 50 శాతాని కంటే ఒక ఓటు అధికంగా రావలసి ఉంటుంది. ఏకపక్షంగా పోలింగ్ జరుగకపోవడం, ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కరికి ఓట్లు ఎక్కువగా పోల్ కావడంతో తొలి ప్రాధాన్యత ఓటుతో ఎవరు గెలిచే అవకాశం లేదని భావి స్తున్నారు. దీనితో రెండవ ప్రాధాన్యత ఓట్లు ఎవరికి ఎక్కువగా పోల య్యాయి.. ఎవరు.. ఎవరి తలరాతలు మార్చనున్నారు అన్నది అంతుపట్టకుండా మారింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో 56 మంది పోటీలో ఉన్నా ఎలిమినేషన్ పద్ధతిలో ఓట్ల లెక్కింపు చేపట్టే క్రమంలో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థి నుంచి మొదలు పెట్టి ఎలిమినేట్ చేస్తూ అతడి బ్యాలెట్‌లో రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి వస్తే వారికి వాటిని కలుపుతూ వెళ్తారు. చివరికి మూడో స్థానంలో నిలిచే అభ్యర్థి బ్యాలెట్‌లో వచ్చిన రెండవ ప్రాధాన్యత ఓట్లు ఎవరికి అనుకూలంగా వస్తాయో వారు గెలు పొందే అవకాశాలు ఉంటాయి. ఆ ఓట్లు రెండో స్థానంలో ఉన్నవారికి ఎక్కువగా వచ్చే పక్షంలో మొదటి అభ్యర్థి ఓడిపోవడానికి కూడా అవకాశాలుంటాయి. దీనితో మొదటి స్థానంలో నిలిచిన మిగతా అభ్యర్థుల కంటే కొంత ఎక్కువ సంఖ్యలో మెజార్టీ ఉంటేనే విజయం సాధించ గలమని భావిస్తున్న అభ్యర్థులు లెక్కలు వేసుకుంటూ కాలం గడుపుతున్నారు.

కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి తప్పకుండా మొదటి స్థానంలో ఉంటారని, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ రెండవ స్థానంలో, బీజేపీ అభ్యర్థి సి.అంజిరెడ్డి మూడవ స్థానంలో ఉంటారని గెలుపు తమదేనని కాంగ్రెస్‌నేతలు ధీమాగా చెబుతున్నారు. అయితే బీజేపీ నేతలు మాత్రం అన్ని ప్రాంతాల్లోనూ తమకు ఓటింగ్ జరిగినందున గెలుపు తమదేనని, రెండవ స్థానంలో నిలిచినా మూడవ అభ్యర్థి సెకండ్ ప్రాధాన్యత ఓటుతో తామే గెలుస్తామని చెబుతున్నారు. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ బీసీ సెంటిమెంట్ బలంగా రావడంతో గెలుపు అవకాశాలు తనకే ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. మొదటి రెండు స్థానాల్లోనే ప్రసన్న హరికృష్ణ ఉంటారని, రెండవ ప్రాధాన్యతా ఓట్లు తనకు ఏక పక్షంగా అన్ని జిల్లాల్లో పోల్ కావడంతో విజయం సాధించేది అతనేనని బీసీ నాయకులు బలంగా చెబుతున్నారు.

బీజేపీ రాష్ట్ర నాయకత్వం పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి అంజిరెడ్డికి ప్రచారక్రమంలో క్యాడర్‌తో సమన్వయ లోపం ఏర్పడిందని, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌తోపాటు స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు కష్టపడి పనిచేసినా పోలింగ్ బూత్‌ల పరిధిలో క్యాడర్‌కు అభ్యర్థుల అనుచరులకు గ్యాప్ వచ్చిందని జాతీయ నాయకత్వానికి నివేదిక పంపించారని సమాచారం. ఆయా ప్రాంతాల్లో స్థానిక కార్యకర్తలు, ప్రత్యర్థులవైపు మొగ్గు చూపారని, మరి కొందరు రెండవ ప్రాధాన్యత ఓటును బీఎస్పీ అభ్యర్థికి అనుకూలంగా వేశారని దీనికి ఖచ్చితంగా గెలుస్తామనుకున్న స్థానంలో గట్టిపోటీ ఎదుర్కోవలసి వస్తున్నదని జాతీయ నాయకత్వానికి నివేదించడంతో ఇక్కడ గెలుపుపై ఆ పార్టీకే విశ్వాసం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. దీనితో పోటీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మధ్యే ఉంటుందని అంచనా వేస్తున్నారు. పోలింగ్ రోజు కనిపించిన పరిస్థితులు ముక్కోణపు పోటీ జరుగుతున్నదని అభిప్రాయం కల్పించిన నేపథ్యంలో ఎవరు గెలుస్తారు... అన్నది తేలికగా చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ఉపాధ్యాయ స్థానంలో...

ఉపాధ్యాయ స్థానంలో అంచనాకు మించి పోలింగ్ జరుగడంతో విజయం ఎవరిని వరిస్తుందనేది స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డితో పాటు మరో 12 మంది పోటీలో ఉన్నప్పటికీ ప్రధానంగా మల్క కొమురయ్య, వంగ మహేందర్‌రెడ్డికే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్యకు అధికంగా ఓట్లు పోలైనట్లు ఆ పార్టీ చెబుతుండగా, ఇతర జిల్లాల్లో మహేందర్‌రెడ్డి కూడా గట్టి పోటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే బీజేపీ మాత్రం పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో ఒకటి గెలుస్తామని ఉపాధ్యాయ స్థానంపై ధీమాతో ఉన్నది. ఈ ఫలితాలపై కూడా ఉపాధ్యా యవర్గాల్లో చర్చలు జోరుగా సాగుతున్నాయి.

పెన్షనర్స్‌కు వెంటనే బెనిఫిట్స్‌చెల్లించాలి

హుజూరాబాద్, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పెన్షనర్స్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్‌రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లాఅధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, గౌరవ అధ్యక్షుడు కట్ట నాగభూషణచారి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్‌లో వారు మాట్లాడుతూ గతఏప్రిల్2024నుంచి ఇప్పటివరకు పదవీవిరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన గ్రాట్యుటీ కమ్యూటేషన్ వేల్యూఆఫ్‌పెన్షన్ జీపీఎఫ్, ఇతర బెనిఫిట్స్ ఇప్పటివరకు చాలామందికి మంజూరు చేయలేదన్నారు. పెన్షనర్స్‌ను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను మంజూరు చేయాలని కోరారు.





సేద తీరుతున్న అభ్యర్థులు

ఐదారు మాసాలుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా గడిపిన ప్రధాన పార్టీల అభ్యర్థులు పోలింగ్ ముగియడంతో సేద తీరుతున్నారు. కాగ్రెస్ అభ్యర్థి, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి శుక్రవారం విద్యార్థులతో సరదాగా గడిపారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నహరికృష్ణ కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి సరదాగా గడిపారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్



దుబ్బరాజన్న జాతరలో భక్తజన సందోహం

కన్నుల పండువగా దుబ్బరాజన్న రథోత్సవం

● భారీగా తరలి వచ్చిన భక్తులు

సారంగాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంబట్ల, కోనాపూర్ శ్రీ దుబ్బరాజన్న రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. రథం ముందు పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవ మూర్తులను ఉంచారు. భక్తులు శివనామ స్మరణలు చేస్తూ రథాన్ని ముందుకు కదలించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. డీఎస్పీ రఘు చందర్, సీఐకృష్ణారెడ్డి, ఎస్సై దత్తాద్రి బందోబస్తు నిర్వహించారు. రథం ముందు ఒగ్గు కళాకారులు, పోతురాజుల విన్యాసాలు, శివుని, నరసింహస్వామి వేషధారణలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయఈవో అనూష, చైర్మన్ శంకరయ్య, నాయకులు కొలుముల రమణ, గుర్రాల రాజేందర్‌రెడ్డి, కోండ్ర రాంచందర‌రెడ్డి, బొడ్డుపెల్లి రాజన్న, ఆకులరాజిరెడ్డి, గుర్నాథం మల్లారెడ్డి, శేఖర్‌గౌడ్, ఆకుల రమేష్, తోట లక్ష్మణ్, దీటి వెంకటేష్, లింగన్న, సిబ్బంది, లక్ష్మీరాజం, రజినికాంత్,భక్తులు, తదితరులు పాల్గొన్నారు



పోతురాజుల ప్రదర్శనలు

కొండగట్టు ఆలయంలో టెండర్లు

మల్యాల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే పలు దుకాణాలకు అధికారులు శుక్రవారం టెండర్లు నిర్వహించారు. ఏడాది కాలపరిమితితో కొబ్బరి కాయల విక్రయం, కొబ్బరి ముక్కల ప్రోగు, పూలు, పండ్ల విక్రయం, గాజులు, ప్లాస్టిక్ వస్తువుల విక్రయం, పుట్నాలు, ప్యాలాల విక్రయం, హోటల్, ఫోటో స్టూడియో, సామాన్లు భద్రపరచుకునే హక్కు, స్నానాలు, మరుగుదొడ్లు, కిరాణం, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం, చెప్పులు భద్రపరచడం, వంట చెరుకు అమ్మకం కోసం ఈ-టెండర్, సీల్డ్ టెండర్,బహిరంగవేలం నిర్వహించారు. ఈవేలంలో కొబ్బరికాయల అమ్మకంకు రూ.1.50కోట్లు, పుట్నాలు, ప్యాలాల విక్రయం రూ.27.70లక్షలు, పూలు, పండ్ల విక్రయం రూ.40లక్షలు, గాజులు, ప్లాస్టిక్ వస్తువుల విక్రయం రూ.32లక్షలకు ఖరారు అయినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలి పారు. మిగితావి సరైన వేలం రాకపోవడంతో వాయిదా వేశామని, త్వరలోనే వాటికి మళ్లీ టెండర్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అయితే కాంట్రాక్టర్ల కుమ్మక్కుతో వేలం పెరగలేదని లేనిచో మరింత ఆదాయం సమకూరేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యక్రమంలో పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్, చంద్రశేఖర్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

● ప్రజావాణిలో విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల వినతి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 28 (ఆంధజ్యోతి): విద్యుత్ సంస్థలోని ఆర్టిజన్ కార్మికులను విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ప్రజావాణిలో ఆర్టిజన్ కార్మికులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టిజన్ సంఘ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ సంస్థలు ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌లో దాదాపు 20 వేల మంది ఆర్టిజన్‌లు గత ఏడు సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారన్నారు. అంతకు ముందు ఈ కార్మికులందరూ 15-20 సంవత్సరాలు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేశారు. ఆర్టిజన్‌లు అందరినీ విద్యార్హతలను బట్టి కన్వర్షన్ చేయాలని కోరుతూ గత 5 నెలల నుంచి నిరసనలు, రిలే నిరాహారదీక్షలు, కన్వర్షన్ యాత్రలు చేస్తూనే ఉన్నామన్నారు.

ఇదే విషయమై వినతిపత్రాలు సమర్పించామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ వజీర్, పవర్ ఎంప్లాయీస్ యునియన్ రీజినల్ అధ్యక్షుడు చందర్‌సింగ్ ఠాగుర్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని ప్రజావాణి వద్ద విద్యుత్ ఆర్టిజన్‌లు

పంటలను ముంచుతున్న కెనాల్ నీరు

● కాలువ లేక నష్టపోతున్న రైతులు ● పట్టించుకోని అధికారులు



మల్యాల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని మానాల శివారు నుంచి వెళ్లె ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్ డీ-67 వచ్చే నీటితో మ్యాడంపల్లి శివారులో పంటలకు నష్టం వాటిల్లుతోంది. కాలువ నీరు సరైన మార్గం లేక పంటల నుంచి వెళ్తుండడంతో రైతులు ఆందోళన చెందు తున్నారు. మండలంలోని మానాల నుంచి తక్కళ్లపల్లితో పాటు పెగడపల్లి మండలంలోని పలు గ్రామాలకు డీ-67 ఉప కాలువ ద్వారా నీరు వెళ్తుంటాయి. అయితే మ్యాడంపల్లి శివారులో ఉపకాలువ ద్వారా సమీప పెద్ద చెరువులోకి నీరు మళ్లిస్తుంటారు. దీని కింద సుమారు వంద ఎకరాల ఆయకట్టు ఉంది. గుట్టలకు కాంటూరు కందకాల తవ్వ కంతో ఈ చెరువులోకి నీరు కొన్ని ఏళ్ల క్రితమే నిలిచి పోయింది. దీంతో ఉప కాలువ నుంచి నీటిని చెరువులోకి మళ్లిస్తున్నారు. పెద్ద చెరువులోకి నీరు తరలించడానికి ప్రత్యేక మార్గం లేకపోవడంతో రైతుల పంటల నుంచి వెళ్తున్నాయి. దీంతో పంటలకు నష్టం వాటిల్లుతోంది.

ఉప కాలువ నుంచి పెద్ద చెరువు మధ్యలో కేవలం 400 మీటర్ల మేర సీసీతో కాలువ నిర్మిస్తే చెరువులోకి నీరు వెళ్లే అవకాశం ఉంది. అయితే ప్రజాప్రతినిధులకు, సంబంధిత అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని రైతులు వాపోతున్నారు. పొలాల నుంచి నీరు వెళ్లకుండా తగు చర్యలు తీసుకొని పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు



మాట్లాడుతున్న కుతాడి శివరాజ్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడ చూసినా కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలంగాణ లేబర్ యూనియన్ రాష్ట్రఅధ్యక్షుడు కుతాడి శివరాజ్ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో తెలంగాణ లేబర్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల రక్షణ కోసమే తెలంగాణ లేబర్‌యూనియన్ ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో వలసకార్మికులు రావడంతో స్థానిక కార్మికులకు ఉపాధికరువైందన్నారు. కేంద్రం కార్మికచట్టాలను చిత్తుకాగితంలా మార్చిందని మండిపడ్డారు. కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటుచేసిన చట్టాలు అమలయ్యే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్‌ఉపాధ్యక్షురాలు మొగురం మీరియా, జిల్లాఅధ్యక్షుడు కాశిపాక అజయ్, మంచిర్యాలజిల్లా అధ్యక్షుడు కారుకూరి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు జగ్గబుంల లలిత, గందేకొమురయ్య, చిప్పకుర్తి లలిత, పెర్క కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


ఎగ్జిబిట్ వివరాలు తెలుసుకుంటున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్‌రావు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ విజ్ఞానశాస్త్ర వేత్త సర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా జిల్లాలోని పలు విద్యాసంస్థల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నగరంలోని అల్ఫోర్స్ జెన్ నెక్స్ స్కూల్‌లో సీవీ రామన్ చిత్రపటానికి విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు.

● నగరంలోని పారమిత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో విద్యార్థులు ఎగ్జిబిట్‌లను ప్రదర్శించారు. వివిధ శాస్త్రవేత్తల వేషధారణలో ఆకట్టుకున్నారు. పాఠశాలల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్‌రావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, ప్రసాద్, వినోద్‌రావు, రమణ, హనుమంత రావు, ప్రిన్సిపాల్‌లు గోపీకృష్ణ, బాలాజీ, ప్రశాంత్ పాల్గొన్నారు

వివేకానంద సీబీఎస్‌ఈ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులు వివిధ సైన్స్ మోడల్‌లను ప్రదర్శించారు. చైర్మన్ డాక్టర్ పి.సుధాకర్ రావు పోల్సాని, డైరెక్టర్ (అకడమిక్) డాక్టర్ లలితకుమారిని, అధ్యాపకులను అభినందించారు.

మానేరు సీబీఎస్‌ఈ పాఠశాలలో విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసంత్ వ్యాలీ పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్స్ తయారు చేశారు. చైర్మన్ బుచ్చిరెడ్డి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ముండయ్య, తాజా మాజీ కార్పొరేటర్ ఆనంద్ పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో చార్లెస్ డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం అనే అంశంపై చర్చా గోష్ఠి నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, సీనియర్ నాయకుడు రామరాజు, కార్యదర్శి శంకర్, కోశాధికారి గడ్డం అశోక్ పాల్గొన్నారు.

● శ్రీసరస్వతీ శిశుమందిర్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల అధ్యక్షులు బల్మూరి కరుణాకర్‌రావు, కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి, సహకార్యదర్శి కొండా గంగాధర్, సమితి అధ్యక్షుడు డాక్టర్ రమణాచారి, సమితి కార్యదర్శి సత్యనారాయణ, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

● జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా కోరా జాన్సన్ పాఠశాలలో శుక్రవారం సైన్స్ ఫోర్టిపై నిర్వహించారు. కరీంనగర్ సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ మహిపాల్‌రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ, వంగళ సంతోష్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

సెయింట్ పాల్స్ పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన నమూనాల ప్రదర్శనను పాఠశాల చైర్మన్ ఎం.రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ లీన ప్రియదర్శిని ప్రారంభించారు.

కరీంనగర్ స్పోర్ట్స్: నగరంలోని వాణీనికేతన్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ రేణుక సైన్స్ ప్రదర్శనను ప్రారంభించారు. జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, గణిత రీసోర్స్ పర్సన్ అశోక్ రెడ్డి, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ సైన్ దినోత్సవం నిర్వహించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి.నమ్రత, ప్రొఫెసర్ డాక్టర్ బి.దిగంబర్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మొగిలి, డాక్టర్ విద్య,అకాడమిక్‌కోఆర్డినేటర్ డాక్టర్ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

●తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర డిగ్రీ కళాశాల, కరీంనగర్‌లో వైజ్ఞానిక నమూనాలను, గోడచిత్రాలను ప్రదర్శించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వేణుగోపాల్ రావు బహుమతులు ప్రదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ బి.లావణ్య పాల్గొన్నారు.


గంగాధరలో ప్రాజెక్టులను తిలకిస్తున్న ఎంఈవో ప్రభాకర్‌రావు


ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్: కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల రేకుర్తి, తీగలగుట్టపల్లి, విద్యానగర్‌లోని నినోస్ బ్లాక్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేకుర్తిలోని విజన్ హైస్కూల్‌లో సైన్స్ డే నిర్వహించారు. యాజమాన్యం సిరిపురం ప్రసాద్, మల్లయ్య, వెంకట్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి మండలం ఆసీఫ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కట్ట వెంకటేశ్వర్లు, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూరాబాద్/హుజూరాబాద్‌రూరల్/గంగాధర/జమ్మికుంట/సైదాపూర్/శంకరపట్నం/మానకొండూర్/గన్నేరువరం/చొప్పదండి/రామడుగు/తిమ్మాపూర్ : హుజూరాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ ఏకశిల, సింగాపూర్‌లోని వీఎస్ఆర్ డిగ్రీకళాశాలలో, జమ్మికుంటలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో, సైదాపూర్, శంకరపట్నం, మానకొండూర్, గన్నేరువరం, చొప్పదండి, రామడుగు, తిమ్మాపూర్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయసైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించిన ఎంఈవోలు వారిని అభినందించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు.

కొత్త కవులకు ప్రోత్సాహం


పురస్కారాన్ని అందజేస్తున్న సభ్యులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : నవ కవులు, రచయితలకు పురస్కారాలు కొత్త ప్రోత్సాహాన్ని అందిస్తాయని సాహితీవేత్త, అవధాని డాక్టర్ గండ్ర లక్ష్మణరావు అన్నారు. జగిత్యాలకు చెందిన కళాశ్రీ సాహితీ వేదిక కవి ఇంటికి కళాశ్రీ అవార్డు పేరుతో శ్రీకారం చుట్టిన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తొలి పురస్కారాన్ని కరీంనగర్ శ్రీనగర్ కాలనీకి చెందిన కవి, రచయిత, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, వరాహమిహిర జ్యోతిషాలయ నిర్వాహకుడు కాండూరి వెంకటేశ్వర్లుకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ సంస్థ సేవలు ప్రశంసనీయమన్నారు. అధ్యక్షుడు గుండేటి రాజు కృషి అభినందనీయమన్నారు. సభా సమన్వయకర్త కొత్త అనిల్‌కుమార్, సంస్థ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

2, 8 తేదీల్లో అవార్డుల ప్రదానం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా మార్చి 2న కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు 2025 సంవత్సరానికి పలువురికి దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారక అవార్డులు ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జి.కృపాదానం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న కళాభారతిలో ఉదయం 10 గంటల నుంచి కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమి, జిల్లా నాటక సమాజాల సమాఖ్య, సల్వాజి ఈవెంట్స్, కళారవళి సోషియో కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా మహిళా శక్తిమాన్ అవార్డులను ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు జి.కృపాదానం, రొడ్డ యాదగిరి, మాడిశెట్టి గోపాల్, విష్ణుదాస్ గోపాల్‌రావు, సల్వాజి ప్రవీణ్ తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ వెలికి తీసేందుకే సైన్స్ ఫెయిర్

భగత్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు సైన్స్ ఫెయిర్ దోహదపడుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని శ్రీచైతన్య స్కూల్ వావిలాలపల్లి, విద్యారణ్యపురి బ్రాంచ్‌లలో సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో మాట్లాడారు. మాజీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్, బండారి అంజనేయులు తదితరులు ఉన్నారు.

పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు వీడ్కోలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనరేట్‌లో పదవీ విరమణ చేస్తున్న ముగ్గురు పోలీసు అధికారులకు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనికేషన్ విభాగంలో ఎస్సైగా పని చేస్తున్న జి.నరసింహారావు, సీసీఆర్‌బీలో పనిచేస్తున్న ఏఎస్సై ఎండీ మన్సూర్, కరీంనగర్ రూరల్ పోలీసు ఠాణాలో ఏఎస్సైగా పనిచేస్తున్న కె.అంజయ్య పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి వారిని సన్మానించారు. అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, సీసీఆర్‌బీ ఏసీపీ విజయ్ కుమార్, ఆర్ఐ శ్రీధర్‌రెడ్డి, పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై సురేందర్ పాల్గొన్నారు.

ట్రినిటి కళాశాలపై చర్యలు తీసుకోవాలి

భగత్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని చితకబాదిన ట్రినిటి కళాశాలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధానకార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. శుక్రవారం రేకుర్తిలోని ట్రినిటి కళాశాల గేటు ఎదుట డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో సీఈసీ రెండో సంవత్సరం చదువుతున్న తరుణ్ అనే విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్, పీఈటీ చితకబాదారని ఆరోపించారు. నాయకులు నవీన్, సింహాద్రి, అరవింద్, రాజేష్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి):అసోసియేషన్ ఆఫ్ అయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ నూతన జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం నగరంలోని ఒక హోటల్‌లో ఎన్నుకున్నారు. జిల్లా గవర్నర్‌గా చీకోటి శ్రీనివాస్, మొదటి ఉప గవర్నర్‌గా కొంజర్ల మహేశ్, రెండవ ఉప గవర్నర్‌గా ఎస్ఎల్ఎవిఎంఎస్ఎం ప్రసాద్, కార్యదర్శిగా పులాల శ్యామ్, కోశాధికారిగా కట్కూరి సుధాకర్, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్‌గా ముస్కుల విద్యాసాగర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంటర్నేషనల్ కమిటి చైర్మెన్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కోల అన్నారెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

మున్సిపల్ ఈఈ రొడ్డ యాదగిరిపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రొడ్డ యాదగిరిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కాంట్రాక్టర్ల సంక్షేమ సంఘం కోరింది. శుక్రవారం సంఘం అధ్యక్షుడు దుగ్గు మహేందర్ రాకేశ్‌తోపాటు మరో 56 మంది కాంట్రాక్టర్లు కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. రావాల్సిన బిల్లులు ఇప్పించాలని కోరుతూ ఈఈ యాదగిరి వద్దకు వెళ్లిన కాంట్రాక్టర్ వరాల నారాయణపై ఆగ్రహం వ్యక్తం చేశాడని, అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును పెట్టారని ఆరోపించారు.

యతిరాజ్‌కు పీసీ సర్కార్ అవార్డు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇంద్ర జాలికుల దినోత్సవం సందర్భంగా కరీంనగర్‌కు చెందిన కాస యతిరాజ్ పీసీ సర్కార్ అవార్డు అందుకున్నారు. గురువారం రాత్రి రవీంద్రభారతిలో భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో, ఆర్‌కే వండర్ వరల్డ్, తెలంగాణ మ్యాజిక్ అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నంద అవార్డు అందజేశారు.

ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం పదవీ విరమణ

భగత్‌నగర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (మెకానికల్) కందికొండ సత్యనారాయణ శుక్రవారం పదవీ విరమణ పొందారు. కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు సన్మానించారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్. భూపతి రెడ్డి, పర్సనల్ ఆఫీసర్ ఎం.చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, డిపోల మేనేజర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు అన్యాయం


సెమినార్‌లో మాట్లాడుతున్న
తెలంగాణ వ్యవసాయ కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్

భగత్‌నగర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర బడ్జెట్‌లో పేదలకు అన్యాయం చేశారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.ప్రసాద్ అన్నారు. శుక్రవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో 'కేంద్ర బడ్జెట్.. గ్రామీణ పేదలపై ప్రభావం' అనే అంశంపై నిర్వ హించిన సదస్సులో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదల కడుపు కొట్టి కార్పొరేట్లకు పెట్టే విధంగా ఉందని మండిపడ్డారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోయిందని, ఆహార నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటు తున్నాయని అన్నారు. నిత్యావసర ధరలను అరికట్టేం దుకు బడ్జెట్‌లో చర్యలు చేపట్టకపోవడం ఆందోళన కరమన్నారు. ఉపాధిహామీ పథకానికి నిధులను రూ.86 లక్షల కోట్లకు కుదించడం అన్యాయమన్నారు. కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి అమలు చేయాలని చూస్తున్నారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ణవెంకట్‌రెడ్డి, ఎడ్ల రమేష్, సుంకరి సంపత్, కవ్వంపల్లి అజయ్, వడ్ల రాజు, కొప్పుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై అవగాహన

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక భగత్‌నగర్ వివేకానంద విద్యానికేతన్ విద్యాసంస్థల్లో తెలంగాణ పోలీస్ యాంటీ నార్కోటిక్ బృందం ఆధ్వర్యంలో మత్తుపదార్థాల నియంత్రణపై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ కృష్ణమూర్తి, ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ యువత వారికి తెలియకుండానే డ్రగ్స్ ఊబిలో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య సొగాని, ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ సాగర్ పాల్గొన్నారు

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందనలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరులో నిర్వహించిన జాతీయ సమైక్య శిబిరాన్ని ముగించుకొని వచ్చిన నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సార్వ లావణ్య, కక్కెర్ల సాయిరాంను శుక్రవారం కళాశాలలో అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ వి.ఆగంరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఏసీవో బి.సంపత్ కుమార్, ఏవో బి.శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఊపందుకున్న ఉపాధిహామీ పనులు

● మానకొండూరులో ప్రారంభం
● గ్రామాల్లో 500 మంది కూలీలు


అన్నారంలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులు

మానకొండూర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలంలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. మండలంలోని ముంజంపల్లి, అన్నారం, రంగపేట, గట్టుదుద్దెనపల్లి, శంషాబాద్, ఖాదర్‌గూడెం, వేగురుపల్లి, ఊటూర్ గ్రామాల్లో నీటి నిల్వ గుంతల పనులు ప్రారంభమయ్యాయి. ఎనిమిది గ్రామాల్లోని గుట్టలు, చెరువుల ప్రాంతాల్లో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే విధంగా పనులు చేపడుతున్నారు. మొదటి రోజు ఎనిమిది గ్రామాల్లో 500 మంది కూలీలు పనులు చేశారు. పనులు జరుగుతున్న ప్రదేశాల్లో మంచినీరు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. మార్చి మొదటివారం నుంచి ఎక్కువ మంది కూలీలు పనికి వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు.

● కొలతల మేరకు చేస్తే రూ.300
- శ్రీనివాస్, ఏపీవో, మానకొండూర్



మీటరు పొడవు, మీటరు లోతు కొలతల మేరకు పని చేస్తే ఒక్కరికి రూ.300 కూలి వస్తుంది. వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడమే కాకుండా నేల గట్టిగా ఉంటోంది. దీంతో ఇచ్చిన కొలత ప్రకారం పని చేయలేకపోతున్నారు. రోజుకు రూ.230 నుంచి రూ.250వరకు కూలి ఇస్తున్నాం.

ప్రభుత్వ హామీలపై నిలదీయాలి: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినహామీలపై ప్రతికార్యకర్త నిలదీయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హుజూరాబాద్ కేసీ క్యాంపులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుజూరాబాద్ నియోజకవర్గానికి నేను ఒక్కడినే ఎమ్మెల్యేని కాదని, తాను ఎమ్మెల్యేగా గెలిచేందుకు కష్టపడిన ప్రతి కార్యకర్త ఎమ్మెల్యే అని అన్నారు. ప్రతి కార్య కర్తకు వెన్నుదన్నుగా ఉంటానన్నారు. కార్యకర్తలతోపాటు నియోజకవర్గ ప్రజలకు ఏవైనా ఇబ్బందులుంటే తనను ఫోన్లో సంప్రదిస్తే సమస్యను పరిష్కరిం చేందుకు ఎల్లవేళలా కృషిచేస్తానన్నారు. త్వరలోనే నియోజకవర్గ ప్రజలందరిని కలుపుకొని ఆత్మీయసమ్మేళనం ఏర్పాటు చేస్తానన్నారు. సమావేశంలో బండ శ్రీనివాస్, అయిలయ్య, ఎడవెల్లి కొండాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

తిమ్మాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన మడ్డి ఉమ-సంపత్ దంపతుల పెద్ద కూతురు వివాహం నిశ్చయం అవగా వివాహానికి ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. విషయాన్ని తెలు సుకున్న మండలకాంగ్రెస్ నాయకులు 40 వేలరూపాయలను వారి కుటుంబానికి అందజేశారు.

వంటపాత్రల పంపిణీ

శంకరపట్నం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 29 ప్రభుత్వప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ఎంఈవో లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఓంశాంతి ఏజెన్సీసభ్యులు శుక్రవారం వంట పాత్రలు పంపిణీ చేశారు. వంటపాత్రలు అందజేసిన ఓంశాంతి ఏజెన్సీ సభ్యులను ఎంఈవో అభినందించారు.

కంప్యూటర్ అందజేత

చొప్పదండి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ కార్యాలయానికి చొప్పదండి ప్యాక్స్ తరఫున కంప్యూటర్‌ను చైర్మన్ వెల్మ మల్లారెడ్డి వ్యవసాయాధికారి వంశీకృష్ణకు కంప్యూటర్‌ను అందజేశారు.

మాజీఎమ్మెల్యే పరామర్శ

చొప్పదండి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగంపేట పరిధిలోని బీరం రాజయ్యపల్లి గ్రామానికి చెందిన రైతు ఎర్రం మల్లారెడ్డి పాముకాటుతో మృతిచెందగా మాజీఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు

చొప్పదండి, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చొప్పదండిలో ఎలైట్‌జిమ్ ఆధ్వర్యంలో మూడు మండలాల బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కొమ్ముల రమణారెడ్డి, గుర్రం సుజిత్‌రెడ్డి, కొమ్ముల రాజారెడ్డి, సాయికృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా గిరిజా మృత్యుంజయ కల్యాణం

తిమ్మాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గిరిజా మృత్యుంజయ మహాదేవాలయంలో గిరిజా మృత్యుంజయ మహాదేవుల కల్యాణం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎల్ఎండీ వేంకటేశ్వర ఆలయం తరఫున కమిటీ నిర్వాహకులు పట్టువస్త్రాలను సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు సంఘాలు బలోపేతం కావాలి



మాట్లాడుతున్న బండ రాజారెడ్డి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతాంగ సమస్యలు తీరాలంటే రైతు సంఘాలు బలోపేతం కావాలని రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి బండ రాజారెడ్డి అన్నారు. మండలంలోని మొగిలిపాలెంలో రాష్ట్ర రైతుసంఘం మానకొండూరు, తిమ్మాపూర్ మండల మహాసభ సీపీఐ సీనియర్ నాయకుడు నారదాసు రాజేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పొనగంటికేదారి, రైతు సంఘం రాష్ట్రకార్యదర్శి బండ రాజారెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఎరువుల కొరత తీవ్రంగా ఉందని, రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రైతులకునష్టం కలిగించే చర్యలకు ప్రైవేట్ సీడ్స్అండ్ ఫర్టిలైజర్స్ కంపెనీలు పాల్పడుతున్నాయన్నారు. వీటిపైన ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వచ్చేనెల నుంచి జిల్లా, రాష్ట్రమహాసభలకు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లాఅధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి కంది రవిందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


ప్రమాదకరంగా ఉన్న విరిగిన విద్యుత్ స్థంభం

గన్నేరువరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్థంభం విరిగి ప్రమాదకరంగా మారింది. ఇప్పటికి ఆరు నెలలు గడుస్తోంది. విద్యుత్‌అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని యువజన నాయకుడు సంపతి ఉదయ్ ఆధ్వర్యంలో రైతులు, వాహనదారులు శుక్రవారం విరిగిన స్థంభం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఖాసింపేట మానసాదేవి ఆలయానికి వెళ్ళేదారిలో ఈ విద్యుత్ స్థంభం ఉంది. గాలివీస్తే ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు, రైతులు భయపడుతున్నారు. పొలంబాటలో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్నామని చెబుతున్న అధికారులు ఇలాంటి సమస్యలపై సత్వరమే దృష్టిసారించాలని కోరారు. విరిగిన విద్యుత్‌స్థంభాన్ని తొలగించి కొత్త స్థంభాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

దమ్మక్కపేటలో అస్తవ్యస్థంగా డ్రైయినేజీ


అస్తవ్యస్థంగా మురుగునీరు

హుజూరాబాద్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేటలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్‌అధికారులు, కౌన్సిలర్ పట్టించుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. హుజూరాబాద్ మున్సిపాలిటీలో విలీనం కాకముందు దమ్మక్కపేట గ్రామపంచాయతీగా ఉండేది. అప్పుడు నిర్మించిన మురికి కాలువలు తప్ప, కొత్తగా చేసింది ఏం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దోమలు ఎక్కువై ప్రజలు తీవ్ర అనారోగ్య బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి దమ్మక్కపేటలో మురికి కాలువ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నీరు లేని తొట్లు!


కందుగుల శివారులో నిరుపయోగంగా మారిన నీటి తొట్టి

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రంఅయ్యాయి. చెరువు, కుంటలు నీరులేక ఎండిపోయాయి. పశువుల కోసం గ్రామాల్లోకట్టిన నీటితొట్లలో నీరు నింపడం లేదు. దీంతోనీటికోసం పశువులు అల్లాడుతున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో మూగ జీవాలు నీటికోసం అల్లాడు తున్నాయి.

● నిరుపయోగంగా శిథిలావస్థలో..

మండలంలోని ఆయా గ్రామాల్లో నీటితొట్టిలు నిరుపయోగంగా మారి, చెత్త,చెదారం పిచ్చి మొక్కలతో శిథిలావస్థకు చేరుకున్నాయి. పశువుల దాహార్తిని తీర్చడానికి పోషకులు వాటిని బోరు బావులు, చెరువుల్లోకి తీసు కెళ్లి తీసుకెళ్తున్నారు. ప్రస్తుతం చెరువులు, కుంటల్లో సైతం నీరు అడుగంటి పోతోంది.

● చర్యలు తీసుకుంటాం..
-తూర్పాటి సునీత, ఎంపీడీవో, హుజూరాబాద్



గ్రామాల్లో నిరుపయోగంగా మారిన నీటి తొట్లను ఉపయోగంలోకి తేవడానికి చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తాం. వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుకుకూడా చర్యలు తీసుకుంటాం.